www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

# లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జైలుకే



### డాక్టర్ ఆర్ వెంకటరమణ

### జిల్లా వైద్యా ఆరోగ్య ధికారి

**నంద్యాల,జూన్03.అక్షర టైమ్స్:-** నంద్యాలలోని జిల్లా వైద్య అధికారి కార్యాలయం నందు పిసిపిఎన్డిటి కమిటీ మీటింగు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఆర్ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ ఆర్ వెంకటరమణ మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులు స్కానింగ్ కేంద్రాలలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే నిర్వాహకుల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు జైలు శిష్యులు తప్పదని హెచ్చరించారు.చట్ట ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం ప్రోత్సహించడం నేరమన్నారు. సమాజానికి ప్రస్తుత పరిస్థితుల్లో ఆడబిడ్డ ముఖ్యమని ఆడబిడ్డను రక్షించే బాధ్యత సమాజంలోని ప్రతి పౌరునికి ఉందని తెలియజేశారు స్కానింగ్ సెంటర్లలో ధరల బోర్డులు ప్రదర్శించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్లైన డాక్టర్ శ్రవణ్ కుమార్ రేడియాలజిస్ట్, డాక్టర్ లక్ష్మీనారాయణ చిన్నపిల్లల వైద్యులు, డాక్టర్ సలీమున్నీసా బేగం గైనకాలజిస్ట్, జిల్లా మాస్ మీడియా అధికారి మల్లేపల్లి పామన్న, బర్డ్స్ , మరియు మదర్ సొసైటీ స్వచ్ఛంద ప్రతిని దులు, వంశీ పాల్గొన్నారు.

# నంద్యాల ప్రజల గుండెల్లోంచి శిల్పా కుటుంబాన్ని ఎవరూ చెరిపేయలేరు : మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి

### అధికారం ఉంది కదా

### అని సేవా కార్యక్రమాలను అడ్డుకుంటారా.?

### తమకు మళ్లీ ఒక రోజు వస్తుంది..

### ప్రజల దీవెనలు మాకున్నాయి





**నంద్యాల,జూన్03.అక్షర టైమ్స్:-** నంద్యాల ప్రజల గుండెల్లోంచి శిల్పా కుటుంబాన్ని ఎవరూ చెరిపేయలేరు..! అధికారం ఉంది కదా అని అడ్డుకుంటే.. సేవ ఆగిపోదు..! నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి భావోద్వేగ వ్యాఖ్యలు ఇప్పుడు స్థానికంగా సంచలనంగా మారాయి. "మాకు మళ్లీ ఒక రోజు వస్తుంది.. ప్రజల దీవెనలు మాకున్నాయి" అంటూ ఆయన ప్రత్యర్థులకు గట్టి కౌంటర్ ఇచ్చారు. రాజకీయాలు వస్తుంటాయి.. పోతుంటాయి.. అధికారాలు మారుతుంటాయి. కానీ, పేదవాడి ఆకలి, పేదింటి మహిళ కష్టం ఎప్పుడూ ఒకేలా ఉంటాయి. నంద్యాల నడిబొడ్డున గత 16 ఏళ్లుగా నిరంతరంగా సాగుతున్న శిల్పా సేవాసమితి ప్రస్థానంలో ఇప్పుడు రాజకీయ అడ్డంకులు కలకలం రేపుతున్నాయి. శిల్పా మహిళా సహకార బ్యాంక్ ద్వారా అర్హులైన 141 మంది పేద మహిళలకు.. దాదాపు 24 లక్షల 58 వేల రూపాయల రుణాల చెక్కులను మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడిన మాటలు నంద్యాల ప్రజల మనసులను తాకుతున్నాయి.మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ "నంద్యాల ప్రజల మనసుల్లోంచి శిల్పా కుటుంబాన్ని ఎవ్వరూ చెరిపేయలేరు. మాకు మళ్లీ ఒక రోజు వస్తుంది. అధికారం ఉంది కదా అని మేము చేస్తున్న సేవా కార్యక్రమాలకు అడ్డంకులు సృష్టిస్తున్నారు. భగవంతుని ఆశీస్సులు, ప్రజల దీవెనలతో మేము ముందుకు వెళ్తాం అన్నారు. కక్ష సాధింపు చర్యలా? లేక కావాలనే అడ్డుకుంటున్నారా? టెక్కె మార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్స్‌లో గత 16 ఏళ్లుగా శిల్పా సహకార్, శిల్పా మహిళా సహకార్ బ్యాంక్, నంది రైతు పెస్టిసైడ్స్ నడుస్తూ.. పేదలకు, రైతులకు అండగా నిలుస్తున్నాయి. 1987లో కట్టిన ఆ బిల్డింగులు, దాదాపు 23 ఏళ్ల పాటు శిథిలావస్థలో ఉంటే.. వాటిని సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించి, క్రమం తప్పకుండా అద్దెలు కడుతూ సేవ చేస్తుంటే.. ఇప్పుడు వాటిని ఖాళీ చేయించేందుకు, ఈనెల 9న బహిరంగ వేలం వేసేందుకు నోటీసులు ఇవ్వడంపై శిల్పా రవిరెడ్డి తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని నోటీసులు ఇచ్చినా.. పేదలకు చేసే సేవలను ఆపే ప్రసక్తే లేదని శిల్పా రవిరెడ్డి స్పష్టం చేశారు. రుణాలు అందుకున్న మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునే వరకు తమ వంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్లు హరిలీల, లక్ష్మీనారాయణ ,మహిళలు పాల్గొన్నారు. అధికార బలం ముందు.. పేదల ఆశీస్సుల బలం గెలుస్తుందా? శిల్పా కుటుంబం నంద్యాల ప్రజల గుండెల్లో సంపాదించుకున్న స్థానాన్ని ప్రత్యర్థులు చెరపగలరా? కాలమే సమాధానం చెప్పాలి.

# వెన్నుపోటుకు రెండేళ్లు పోస్టర్ ను విడుదల చేసిన వై.సీతారాం రెడ్డి



**కౌతాళం,జూన్03.అక్షర టైమ్స్:-** రాంపురం గ్రామం నందు మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి పిలుపుమేరకు వై సీతారామరెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటుకు రెండేళ్లు పోస్టర్ ను విడుదల చేశారు. జూన్ 4వ తేదీ నుంచి 12వ తేదీ వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమాలు, అబద్ధపు హామీలతో ఆంధ్ర రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచిన నేటి చంద్రబాబు. మహానాడు కార్యక్రమంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి మీద విమర్శలు తప్ప రాష్ట్ర అభివృద్ధి లేదు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానన్న హామీ ఏమైంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌతాళం మండలానికి సంబంధించి నాయకులు కౌతాళం మండల కన్వీనర్ ప్రహల్లాద ఆచారి, వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి,ఉరుకుంద మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ నాగరాజు గౌడ్, మాజీ హై స్కూల్ చైర్మన్ వడ్డే రాముడు, మరియు నాలుగు మండలాల వైసీపీ నాయకులుపాల్గోన్నారు.

# ఎన్నికల హామీలు ఎక్కడ.? ప్రభుత్వాన్ని నిలదీసిన : మాజీ ఎమ్మెల్యే

### 'వెన్నుపోటుకు రెండేళ్లు' పోస్టర్ ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి విమర్శలు



**ఆదోని,జూన్03.అక్షర టైమ్స్:-** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి విమర్శించారు. బుధవారం ఆదోనిలో నిర్వహించిన కార్యక్రమంలో 'వెన్నుపోటుకు రెండేళ్లు' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో ప్రకటించిన పథకాలు ప్రజలను ఆకర్షించేందుకు చేసిన హామీలుగానే మిగిలిపోయాయని ఆరోపించారు. నిరుద్యోగులు, మహిళలు, రైతులు, విద్యార్థులు, పింఛన్‌దారులు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. రైతులకు రూ.20 వేల ఆర్థిక సాయం, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రంజాన్ తోఫా, సంక్రాంతి కానుక వంటి పలు హామీలు అమలుకు నోచుకోలేదని అన్నారు. అమ్మఒడి పథకాన్ని 'తల్లికి వందనం'గా పేరు మార్చినప్పటికీ పూర్తి స్థాయిలో లబ్ధి చేకూరడం లేదని విమర్శించారు. అలాగే ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాలు బలహీనపడ్డాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాల్లో భాగంగా జూన్ 4న కూటమి మేనిఫెస్టో దహనం, జూన్ 8న ప్రజా, ఉద్యోగ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం, జూన్ 12న నిరుద్యోగులు, డీఎస్సీ అభ్యర్థులు, వివిధ వర్గాల లబ్ధిదారులతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి సీనియర్ నాయకులు చంద్రకాంత్ రెడ్డి, దేవా, పరిగల్ నారాయణ, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ వేదికపై ఏపీ ప్రకృతి వ్యవసాయ ఘనత: "ఫుడ్ ప్లానెట్ ప్రైజ్--2026" కైవసం





**నంద్యాల,జూన్03.అక్షర టైమ్స్:-** ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ (ఏపీసీఎన్ఎఫ్) కార్యక్రమం ప్రపంచ స్థాయి గుర్తింపును దక్కించుకుంది. పర్యావరణ పరిరక్షణ మరియు ఆహార వ్యవస్థల పరివర్తన లక్ష్యంగా స్వీడన్‌కు చెందిన 'కర్ట్ బర్గ్‌ఫోర్స్ ఫౌండేషన్' (జబతీ దీవతీస్త్రటశీతీం ఖీశీబఅఝుఅశీఅ) అందజేసే ప్రతిష్టాత్మక "ఫుడ్ ప్లానెట్ ప్రైజ్--2026" అవార్డు ఈ ఏడాది ఏపీసీఎన్ఎఫ్ కి లభించడం పట్ల ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (డీపీఎం) శ్రీనివాసులు ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేసారు. ఈ పురస్కారం రాష్ట్రానికి, దేశానికి దక్కిన గొప్ప గౌరవమన్నారు. ఏపీసీఎన్ఎఫ్ సాధించిన ఈ అరుదైన మైలురాయికి గాను ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు కి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ కి, రైతు సాధికార సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు టి.విజయకుమార్ కి, ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.రామారావు కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘనతలో భాగస్వాములైన జిల్లాలోని మహిళలకు, ప్రకృతి వ్యవసాయ రైతులకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ ప్రయాణానికి రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని అన్నారు. అయితే, ఈ ప్రపంచ స్థాయి విజయానికి క్షేత్రస్థాయిలో రాత్రింబవళ్లు శ్రమిస్తున్న జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ రైతన్నలు, మహిళా స్వయం సహాయక సంఘాల సోదరీమణులే అసలైన శిల్పులని పేర్కొన్న డీపీఎం శ్రీనివాసులు, దీనికి నిదర్శనంగా నంద్యాల జిల్లా, డోన్ మండలం, బి.రామదుర్గం గ్రామానికి చెందిన ఆదర్శ మహిళా రైతు మహేశ్వరి పూర్తి విజయగాథను ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారిన మహేశ్వరి, కేవలం 8 ఏళ్ల వయసులోనే రోజుకు 15 రూపాయల కూలీ కోసం ఉదయం 6 నుండి సాయంత్రం 6 వరకు పత్తి చేలలో పని చేసేవారు. అయితే, ఒక స్వచ్ఛంద సంస్థ చొరవతో 'బాల కార్మికుల క్యాంపు' ద్వారా చదువు బాట పట్టిన మహేశ్వరి, పట్టుదలతో ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నారు. చదువు పూర్తి కాగానే అన్నయ్య వివాహం చేశారు. జీవితం బాగుంటుందని ఆశించిన ఆమెకు, భర్త రూపంలో మరో కష్టం ఎదురైంది. తాగుడుకు బానిసైన భర్త బాధ్యతలు విస్మరించి, శారీరక, మానసిక వేధింపులకు గురి చేయడంతో, ఇద్దరు కుమార్తెలను అక్కున చేర్చుకుని ఆమె ఒంటరిగా బయటకు రావాల్సి వచ్చింది. పుట్టిన ఇల్లు, కన్నవారు లేక, సోదరుడి ఆసరా దొరకకపోయినా కుంగిపోకుండా తన బిడ్డల భవిష్యత్తు కోసం శ్రమనే నమ్ముకున్నారు. ప్రకృతి సేద్యమే ఊపిరిగా మొదట వ్యవసాయ కూలీగా, విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (ఞూూ)గా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చిన మహేశ్వరి, తనకున్న కొద్దిపాటి కౌలు భూమిలో రసాయన వ్యవసాయం చేసి పెట్టుబడి కూడా రాక తీవ్ర నష్టాలను చూశారు. ఆ సమయంలో మాస్టర్ ట్రైనర్ లక్ష్మీనారాయణ ప్రోత్సాహంతో గుంటూరులో సుభాష్ పాలేకర్ నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. అక్కడ పొందిన జ్ఞానంతో ఒక ఎకరం కౌలు భూమిలో ధైర్యంగా ప్రకృతి సేద్యాన్ని ప్రారంభించారు. మొదట్లో గ్రామస్తులు, తోటి రైతులు "మందులు కొట్టకుండా పంటలు పండుతాయా?" అని హేళన చేసినా ఆమె వెనక్కి తగ్గలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో వివిధ రకాల సాగు నమూనాలను అమలు చేస్తూ, క్రమంగా ఆదాయాన్ని పెంచుకున్నారు.

**వైవిధ్యమైన సాగు.. గుర్తింపు తెచ్చిన దిగుబడి**

సాంప్రదాయ ఏక పంట పద్ధతిని వీడి, వైవిధ్యమైన పంటల సాగుకు ఆమె శ్రీకారం చుట్టారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం మరియు వివిధ రకాల కషాయాలను సొంతంగా తయారు చేస్తూ భూసారాన్ని పెంచారు. ప్రకృతి వైపరీత్యాలు, పురుగుల దాడి వల్ల గ్రామంలోని ఇతర రైతుల పంటలు దెబ్బతిన్నప్పుడు కూడా, మహేశ్వరి సాగు చేసిన పంటలు పచ్చగా, ఆరోగ్యంగా ఉండటం చూసి విమర్శించిన వారే ఆశ్చర్యపోయారు. పర్యావరణ హితమైన ఈ సేద్యం ఆమెకు సామాజికంగా గొప్ప గౌరవాన్ని తెచ్చిపెట్టింది. నేడు తన పెద్ద కుమార్తె సింధూజను ఇంటర్మీడియట్, రెండో కుమార్తె దుర్గశ్రీని 9వ తరగతి చదివిస్తూ, ఒక తల్లిగా తన బాధ్యతను సమర్థవంతంగా నెరవేరుస్తున్నారు.నేడు ఆమె కేవలం రైతు మాత్రమే కాదు, ఒక స్వతంత్ర నిర్ణయకర్త. ప్రకృతి వ్యవసాయంతో పాటు టైలరింగ్ ద్వారా అదనపు ఆదాయాన్ని పొందుతూ ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. పి.ఎం.డి.ఎస్ (ప్రీణూ), ఎ.టి.ఎం (ూూవీ) వంటి ఆధునిక పద్ధతులను పాటిస్తూ నాణ్యమైన, విషరహిత పంటలను పండిస్తున్నారు. తన సొంత బ్యాంకు ఖాతాను నిర్వహిస్తూ, ఆర్థిక లావాదేవీలన్నీ స్వయంగా చూసుకుంటున్నారు. మదర్ థెరిసా ఎస్.హెచ్.జి గ్రూపులో క్రియాశీలకంగా ఉంటూ, గ్రామ సభల్లో తన గళాన్ని వినిపిస్తూ పదిమంది మహిళలకు ధైర్యాన్ని నూరిపోస్తున్నారు.విషరహిత ఆహారం పండించడం ద్వారా తన కుటుంబ ఆరోగ్యానికి కూడా ఆమె భరోసా కల్పించారు.ఒక సామాన్య కూలీగా, ఒంటరి మహిళగా ప్రయాణం మొదలుపెట్టిన మహేశ్వరి, నేడు వందలాది మంది రైతులకు దిక్సూచిగా నిలిచారు. "కష్టాన్నే పెట్టుబడిగా, ప్రకృతిని తోడుగా చేసుకుంటే ఏ ఆపదనైనా అధిగమించవచ్చు" అని ఆమె నిరూపించారు. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడిని సాధించడమే కాకుండా, ఆత్మగౌరవంతో కూడిన జీవితాన్ని ఎలా నిర్మించుకోవచ్చో ఆమె విజయగాథ యావత్ మహిళ రైతు లోకానికి చాటి చెబుతోంది.

# సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఓటరు జాబితా పై ప్రత్యేక దృష్టి

### ఆదోని తెలుగుదేశం సీనియర్ నాయకుడు ఉమపతి నాయుడు ఆధ్వర్యంలో యూనిట్ సభ్యులతో చర్చ



**ఆదోని,జూన్03.అక్షర టైమ్స్:-** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మరియు ఆదోని నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి మాజీ శాసనసభ్యులు మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోద కావడంతో పాటు, జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశశీ చేశారు. ఓటర్ల వివరాలు నమోద, మార్పులు, చేర్పులు మరియు తొలగింపుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ నెలలో జరుగుతున్న ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంపై చర్చించారు. ప్రతి ఓటరు వివరాలు సరైన విధంగా నమోదు కావాలని, ఎటువంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నాయకులు సూచించారు. అలాగే (బి ఎల్ ఓ) అధికారులతో సమన్వయం చేసుకొని యూనిట్ సభ్యులు ఇంటింటికి వెళ్లి ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని చేయాలని తెలిపారు.ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఓటరు నమోదు మరియు వెరిఫికేషన్ అత్యంత కీలకమని, ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకొని పనిచేయాలని ఆయన తెలియజేశారు . ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, యూనిట్ సభ్యులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ జిందే శారదా భాయ్, రంగన్న, ఎక్స్ కౌన్సిలర్ బాలాజీ, జిందే శంకర్, ఎక్స్ కౌన్సిలర్ అంజి, గిడ్డయ్య, మల్లికార్జున, సిద్ధ, జీవన్, శివ, కేశప్ప, సోము తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతంపై పల్లా శ్రీనివాసరావుతో గుడిసి ఆది కృష్ణమ్మ భేటీ

### ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేయాలని పిలుపునిచ్చిన : గుడిసి ఆది కృష్ణమ్మ



**ఆదోని,జూన్03.అక్షర టైమ్స్:-**విజయవాడలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు నుకర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, జిల్లా స్థాయి పార్టీ కార్యక్రమాలు, కార్యకర్తల భాగస్వామ్యం తదితర అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు.కర్నూలు జిల్లాలో పార్టీ అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలను రాష్ట్ర అధ్యక్షులకు వివరించిన గుడిసి ఆది కృష్ణమ్మ పార్టీ అధిష్ఠానం సూచించిన కార్యక్రమాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. పార్టీ మరింత బలోపేతం కావడానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షులు సూచించినట్లు తెలిపారు.ఈ భేటీ సందర్భంగా పార్టీ సంస్థాగత బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి పలు అంశాలపై అభిప్రాయాలను పరస్పరం పంచుకున్నారు

# మండలాల విభజన పేరుకే నా.?

### రెండు మండలాలుగా విభజన అధికారుల నియామకాలుఎక్కడ : నుర్ హమ్మద్



**ఆదోని,జూన్03.అక్షర టైమ్స్:-** ఆదోని మండలాన్ని రెండు మండలాలుగా విభజించినప్పటికీ ప్రజలకు ఆశించిన ప్రయోజనాలు అందడం లేదని సామాజిక కార్యకర్త ఏ నూర్ హమ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పరిపాలన ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో మండలాల విభజన చేపట్టినప్పటికీ, ఇప్పటివరకు పూర్తిస్థాయి అధికారుల నియామకాలు జరగకపోవడం విచారకరమని ఆయన పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన మండలాలలో అధికారులు విధులు నిర్వహించవలసిన చోట ఇప్పటికీ ఇన్చార్జిలో బాధ్యతలు నిర్వహిస్తున్నారని, దీంతో ప్రజలకు అవసరమైన సేవలు సకాలంలో అందడం లేదని విమర్శించారు. పరిపాలన వ్యవహారాల్లో జాప్యం ఏర్పడి, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మండలాల విభజన నిజమైన లక్ష్యం నెరవేరాలంటే ప్రభుత్వం వెంటనే పూర్తిస్థాయి అధికారులను నియమించాలని ఏ నూర్ హమ్మద్ డిమాండ్ చేశారు. ఆదోని మండలం రెండుగా విభజించాలని డిమాండ్ చేసి సాధించుకున్న ఎమ్మెల్యే పార్థసారధి అదే ఊపుతో ఆదోని రెండవ మండలం కోసం అన్ని శాఖల అధికారులను నియమించడానికి రాష్ట్ర ప్రభుత్వం వద్ద ముమ్మరంగా ప్రయత్నాలు చేయాలని విజ్ఞప్తి చేయడమైనది. కాబట్టి నూతన ఆదోని రెండో మండలం ఏర్పాటు వల్ల ప్రజలకు న్యాయం జరిగే పరిస్థితి ఏర్పడేందుకు ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి సమస్యలు విన్నవించి నూతన అధికారులను నియమించేందుకు నూతన కార్యాలయాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి తరఫున విన్నవించుకోవడమైనది.

## స్పెషల్ ఆఫీసర్ వెంకట

# సుబ్బయ్యకు ఘన సన్మానం

**పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి**



**వేంపల్లె,జూన్03.అక్షర టైమ్స్:-**పులివెందుల డివిజన్ అభివృద్ధి అధికారి వెంకట సుబ్బయ్యను ప్రభుత్వం వేంపల్లె గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా నియమించిన సందర్భంగా బుధవారం ఆయనకు ఘన సన్మానం నిర్వహించారు. వేంపల్లె పంచాయతీ కార్యాలయానికి విచ్చేసిన వెంకట సుబ్బయ్యను ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, నాయకులు దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి (దిల్మాంగే ), యాసిన్, గంగాధర్ రెడ్డి, అల్తాఫ్ లు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందన్నారు. అనంతరం స్పెషల్ ఆఫీసర్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

# ఏజీపీ రామకృష్ణారెడ్డికి ఘన సన్మానం

**శాలువాతో సన్మానించిన దేశం వెంకటసుబ్బారెడ్డి**



**వేంపల్లె,జూన్03.అక్షర టైమ్స్:-** అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా నియమితులైన అడ్వకేట్ రామకృష్ణారెడ్డిని బుధవారం వేంపల్లెలో దేశం వెంకటసుబ్బారెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దేశం వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ రామకృష్ణారెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ప్రజలకు మరింత సేవలందించి మంచి పేరు ప్రతిష్టలు సంపాదించాలని ఆకాంక్షించారు. తన సేవలతో ఏజీపీ పదవికి వన్నె తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గండి దేవస్థానం మాజీ చైర్మన్ వెంకట రమణ, ఏమిరెడ్డి కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, నాగరాజు, ప్రభాకర్ నాయుడు, ఐచర్ రమణ, అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**ఏపీ పీజీ సెట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులు**



**వేంపల్లె,జూన్03.అక్షర టైమ్స్:-** స్థానిక పట్టణంలోని వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఏపీ పీజీ సెట్‌లో విశేష ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ తెలిపారు. కంప్యూటర్ విభాగంలో జి. గౌతమి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించగా, రసాయన శాస్త్ర విభాగంలో పి. లక్ష్మీదేవి 36వ ర్యాంక్, కే. నవ్యశ్రీ 67వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. అలాగే 100 నుండి 1200 ర్యాంకుల మధ్య 12 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. ఏపీ ఈడీసెట్‌లో వి. కులవర్ధన్ 1681వ ర్యాంక్ సాధించినట్లు ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అధ్యాపక బృందం అభినందించి హర్షం వ్యక్తం చేసినట్లు ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ పేర్కొన్నారు.


# ఎస్ఎంఎ-2 వ్యాధితో బాధపడుతున్న చిన్నారిని ఆదుకోండి



**ప్రొద్దుటూరు,జూన్03.అక్షర టైమ్స్:-** పట్టణంలోని వైఎంఆర్ కాలనీ, భవానీనగర్‌కు చెందిన కాశీ విశ్వనాథ్, బాలలింగమ్మ దంపతుల కుమారుడు వర్షిత్ నాథ్ అరుదైన ఎస్ఎంఎ-2 (స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ) వ్యాధితో బాధపడుతున్నాడని, అతని చికిత్స కోసం దాదాపు రూ.16 కోట్ల విలువైన ప్రత్యేక ఇంజక్షన్ అవసరమని మానవతావాదులు తెలిపారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మానవతావాదులు లక్ష్మీ ప్రసన్న, నాగలక్ష్మి, చిన్నారి తండ్రి స్నేహితుడు నరసింహ మాట్లాడుతూ, ఇంజక్షన్ అందే వరకు చిన్నారికి ఇవ్వాల్సిన ప్రత్యేక సిరప్ ఒక్కటి దాదాపు రూ.16 వేల ఖర్చవుతుందని చెప్పారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన చిన్నారి తండ్రి కాశీ విశ్వనాథ్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుండటంతో చికిత్స ఖర్చులు భరించడం కష్టంగా మారిందన్నారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు ముందుకు వచ్చి చిన్నారి చికిత్సకు ఆర్థిక సహాయం అందించాలని తల్లి బాలలింగమ్మ విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాల కోసం 70951 48237 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

# సేవా దృక్పథంతో వైద్య సేవలు అందించాలి

**వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ రెడ్డి**



**వేంపల్లె,జూన్03.అక్షర టైమ్స్:-** వైద్యులు సేవా దృక్పథంతో ప్రజలకు వైద్య సేవలు అందించాలని వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగారెడ్డి సతీష్ కుమార్ రెడ్డి సూచించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన కిరణ్ చిల్డ్రన్స్ కేర్ ఆసుపత్రిని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారుల వైద్య సేవల కోసం వేంపల్లెలో కిరణ్ చిల్డ్రన్స్ కేర్ ఆసుపత్రి ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. గతంలో చిన్నారుల వైద్యం కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఈ ఆసుపత్రి అందుబాటులోకి రావడంతో ఆ సమస్య తీరుతుందని అన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ఆసుపత్రి అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ సి.వి. కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలో చిన్నారులకు సంబంధించిన వివిధ వ్యాధులకు 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అత్యాధునిక పరికరాలతో చికిత్సలు, టీకాల కార్యక్రమం, నవజాత శిశువులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శశికళ, భారతి, మిషన్ ధర్మారెడ్డి, రామచంద్రారెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ అభివృద్ధిపై దృష్టి సారించండి

**ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టాలి**

**స్వచ్ఛ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి**



**వేంపల్లి,జూన్03.అక్షర టైమ్స్:-** స్థానిక గ్రామ పంచాయతీ అభివృద్ధిపై దృష్టి సారించి, ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి కోరారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీలో స్పెషల్ ఆఫీసర్, డిడిఓ వెంకట సుబ్బయ్యను టిడిపి నేతలు కలిశారు. టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, నాయకులు దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి(దిల్మాంగే), మొండోడు గౌస్, యాసిన్ లు స్థానిక సమస్యలపై స్పెషల్ ఆఫీసర్ వెంకట సుబ్బయ్యతో చర్చించారు. అనంతరం ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలపై నిరంతరం శ్రమిస్తోందని, అధికారులు కూడా అందుకు అణుగుణంగా పని చేయాలని కోరారు. ప్రధానంగా పారిశుధ్యం, తాగునీరు విషయంపై ప్రత్యేక కార్యచరణతో పని చేయాలని సూచించారు. అలాగే ప్లాస్టిక్ నిషేధానికి తగిన చర్యలు చేపట్టాలని, స్వచ్ఛ గ్రామ పంచాయతీగా వేంపల్లెను తీర్చిదిద్దేందుకు నాయకులు, అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ బీటెక్ రవీంద్రనాథ్ రెడ్డి కృషి ఎనలేనదని, టిడిపి కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన

# ఈఓ నాగభూషణ్ రెడ్డికి ఘన సన్మానం

**శాలువాతో సన్మానించిన వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ రెడ్డి**



**వేంపల్లె,జూన్03.అక్షర టైమ్స్:-** ఇటీవల పదవీ విరమణ పొందిన పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈఓ) నాగభూషణ్ రెడ్డిని ఆయన నివాసంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగారెడ్డి సతీష్ కుమార్ రెడ్డి కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నాగభూషణ్ రెడ్డి ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ సేవలో విధులను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు రామచంద్రా రెడ్డి, మునీర్, ప్రసాద్, అజయ్ రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు

# డీఎస్సీపై మాట్లాడే అర్హత వైసీపీకి లేదు

**జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్**




**వేంపల్లె,జూన్03.అక్షర టైమ్స్:-** గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేపట్టిన డీఎస్సీ నియామకాలపై విమర్శలు చేసే అర్హత వైసీపీకి లేదని పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్ అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో డీఎస్సీ నిర్వహించకపోవడంతో నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. డీఎస్సీ నిర్వహణపై వైసీపీ నేతలు విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం డీఎస్సీని పారదర్శకంగా, పటిష్టంగా నిర్వహించిందని దాసరి రవిశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ నారాయణ రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో సాచివేత ధోరణి తగదు


**యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా**

**బద్వేల్,జూన్03.అక్షర టైమ్స్:-** ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం సాచివేత ధోరణి అవలంబించడం తగదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులు విమర్శించారు.బుధవారం ఉదయం ప్రొద్దుటూరులోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆ సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రతిపక్ష హోదాలో కూటమి పెద్దలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలిచ్చారని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే 12వ పిఆర్సీని అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ మెరుగైన వేతనాలను అమలు చేస్తామని,ఆర్థిక బకాయిలను నిర్ణీత గడువులోగా చెల్లిస్తామని, డిఏ లను ఎప్పటికప్పుడు చెల్లిస్తామని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లయినా హామీల అమలులో చిత్తశుద్ధి కనపరచడం లేదన్నారు. పిఆర్సీ గడువు ముగిసి ఇప్పటికే మూడేళ్లయిందని, అయినప్పటికీ పిఆర్సీ కమిషన్ ను ఏర్పాటు చేయడంలో తీవ్ర తాత్సారం చేస్తున్నదని విమర్శించారు. పిఆర్సీ అమలుకు నోచుకోకపోవడం వల్ల పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.30 వేల కోట్ల పైబడిన బకాయిలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఉద్యోగ,




ఉపాధ్యాయులు ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. సమస్యల పరిష్కారం కోసం రెండేళ్లుగా ఎదురుచూస్తున్నామని ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోతే పోరాటమే శరణ్యమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామన్న ప్రభుత్వం సాచివేత ధోరణిలో ముందుకు వెళ్తున్నదన్నారు.కరోనా మహమ్మరితో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు ఆలస్యం చేయడం తగదు అన్నారు. మూడేళ్లుగా సరెండర్ లీవ్ బకాయిలు చెల్లింపులు లేవన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు సైతం టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలనే సుప్రీంకోర్టు ఆదేశాలపై పార్లమెంటులో చట్ట సవరణ చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఉద్యోగుల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యోగుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రవికుమార్ జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఎజాస్ అహ్మద్, గోపీనాథ్,సుబ్బారావు, కంబగిరి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్ణారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ నాయకులు సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# మీరు చేసే ఈ చిన్న తప్పులు మీ దంతాలకు శాపంగా మారుతున్నాయని తెలుసా



దంతాల మీద ఉండే తెల్లటి పొర ఎనామెల్ మన పళ్లకు రక్షణ కవచంలా పనిచేస్తుంది. అయితే ఇటీవలి కాలంలో భారతీయులలో ఈ పొర వేగంగా క్షీణిస్తోందని దంత వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం వృద్ధాప్యం వల్ల మాత్రమే కాకుండా, మనం నిత్యం చేసే కొన్ని పొరపాట్ల వల్ల కూడా పళ్ళు బలహీనంగా మారుతున్నాయని, తద్వారా తీవ్రమైన సెన్సిటివిటీ సమస్యలు తలెత్తుతున్నాయని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

**దైనందిన అలవాట్లు:** చాలామంది పళ్ళు శుభ్రంగా ఉండాలనే ఉద్దేశంతో దంతాలను చాలా వేగంగా, గట్టిగా రుద్దుతుంటారు. ముఖ్యంగా గట్టి బ్రిజిల్స్ ఉన్న బ్రష్‌లను వాడటం వల్ల పళ్ళపై ఉండే సహజమైన ఎనామెల్ పొర క్రమంగా అరిగిపోతుంది. దీనివల్ల పళ్ళు సెన్సిటివిటీకి గురై, చల్లని లేదా వేడి పదార్థాలు తీసుకున్నప్పుడు తీవ్రమైన నొప్పి వస్తుంది. మరోవైపు నేటి ఆధునిక ఆహారపు అలవాట్లు కూడా దంతాలకు ముప్పుగా మారాయి. అలాగే శరీరంలో తగినంత నీరు లేకపోవడం వల్ల లాలాజలం ఉత్పత్తి తగ్గి, నోటిలోని ఆమ్లాలు దంతాలను మరింతగా దెబ్బతీస్తాయి. లాలాజలం అనేది దంతాలకు సహజమైన రక్షణను అందిస్తుంది, కాబట్టి రోజంతా తగినంత నీరు తాగడం చాలా అవసరం.

**కృత్రిమ పద్ధతులు:** తెల్లని చిరునవ్వు కోసం సోషల్ మీడియాలో ప్రాచుర్యం పొందిన నిమ్మరసం, బేకింగ్ సోడా లేదా బొగ్గు వంటి ఇంటి చిట్కాలను పాటించడం దంతాల పాలిట శాపంగా మారుతోంది. ఇవి తాత్కాలికంగా పళ్ళను తెల్లగా చేసినప్పటికీ, వాటిలోని ఘాటైన పదార్థాలు ఎనామెల్‌ను శాశ్వతంగా తొలగిస్తాయి. ఒక్కసారి ఎనామెల్ పొర పోతే అది మళ్ళీ తిరిగి రాదు. అందుకే సాధారణ టూత్‌పేస్టుల కంటే దంతాల ఎనామెల్‌ను రక్షించే ప్రత్యేకమైన పేస్టులను వాడటం మంచిది. ఇవి కాకుండా ఆమ్లాల దాడి నుండి రక్షిస్తాయి. దంతవైద్యుల సలహాతో సరైన పద్ధతులను పాటించడం వల్ల మాత్రమే మన చిరునవ్వుతో పాటు దంతాల ఆరోగ్యాన్ని పదికాలాల పాటు కాపాడుకోగలం.